క్లుప్తంగా

20న ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 20న గౌతమ్ న్యూరోకేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ ఉదయ్‌గౌతమ్ తన తల్లి సరళాదేవి జ్ఞాపకార్థం ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి 5గంటల వరకు కొనసాగే ఈ క్యాంప్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

22న మెగా జాబ్ మేళా

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఈనెల 22న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో సుమారు 100 కంపెనీలు పాల్గొనున్నాయని అన్నారు. పదివేలకు పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగే ఈ జాబ్‌మేళాలో టెన్త్ నుంచి పీజీ పూర్తి చేసిన 18–35 సంవత్సరాల లోపువారు హాజరు కావాలన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సూరారంకాలనీ యూపీహెచ్‌సీలో 18 మంది కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయి. దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు నమోదువుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు.

22 నుంచి 'సెల్ట్' తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న ఇంగ్లిష్ శిక్షణ కేంద్రం (సెల్ట్)లో ఈ నెల 22 నుంచి తరగతులు ప్రారంభంకానున్నట్లు డైరెక్టర్ ప్రొ.సవీన్ బుధవారం తెలిపారు. రెండు నెలల పాటు కొనసాగే శిక్షణకు పది ఆపైన విద్యార్హతలు గల అభ్యర్థులు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 7989903001 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విదేశీ విద్యార్థుల నిధుల దుర్వినియోగం

- విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశీ విద్యార్థుల నిధులను వీసీ ప్రొ.రవీందర్ దుర్వినియోగం చేసినట్లు లింగ్విస్టిక్స్ విభాగం మాజీ హెడ్, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆరోపించారు. ప్రస్తుతం ఓయూ వీసీగా కొనసాగుతున్న ప్రొ.రవీందర్ 2017–2021 వరకు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పదవిలో కొనసాగిన సమయంలో విదేశీ విద్యార్థుల నుంచి ఫీజుల రూపేన మంజూరైన రూ.94 లక్షల నిధులను ఆయా విభాగాలకు అందజేయకుండా రూ.71 లక్షలను దారి మళ్లించినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్సారీ వివరించారు. ఆర్ట్స్ కాలేజీలోని లింగ్విస్టిక్స్ విభాగానికి అత్యధికంగా రావలసిన రూ.10 లక్షలను ఇవ్వలేదన్నారు. విదేశీ విద్యార్థుల నిధుల దుర్వినియోగం గవర్నర్ తమిళిసై, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వివరించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి వీసీ ప్రొ.రవీందర్ పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓయూలో కలేకూరి ప్రసాద్ వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక విప్లవకారుడు కలేకూరి ప్రసాద్ వర్ధంతిని బుధవారం ఓయూలో ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి దళిత బహుజనుల చైతన్యానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అంసా ఓయూ అధ్యక్షులు సామ సైదులు, విద్యార్థి నేతలు సురేష్, నవీన్, రాజేష్, సుధాకర్, మహేష్, రఘు, శివ, వంశీ పాల్గొన్నారు.

స్వచ్ఛత దిశగా.. పంచాయతీలు

పల్లెల్లో ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాలు

- పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన.. విస్తృత ప్రచారం
- మేడ్చల్ జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు
- ప్రతినెలా పల్లె ప్రగతి కింద పనులకు రూ.2.41 కోట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. పల్లెల్లో బుధవారం నుంచి ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాల్లో వారం రోజులపాటు పరిశుభ్రత పనులను కొనసాగించనున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించాల్సి ఉన్నప్పటికీ, ఎంపీఓల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు పారిశుద్ధ్య వారోత్సవాలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రతపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.



- జిల్లాలోని ఐదు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ప్రతీ నెలకు రూ.2.41 కోట్లు కేటాయిస్తున్నారు. ఈ నిధులతో గ్రామంలో అవసరమున్న పనులకు పంచాయతీలు వినియోగిస్తున్నాయి.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

- పల్లెల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వారం రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏటా వానాకాలం ముందు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శులు 16 రోజులుగా సమ్మె చేయడంతో 30 గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కొంత ప్రభావం పడింది. రోజూ ఉదయం వారు గ్రామానికి వెళ్లి కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించేవారు. సమ్మె కారణంగా ఇబ్బందులు తలెత్తడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. అన్ని పంచాయతీల్లో కలిపి మొత్తం 778 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతీ 500 జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడి చొప్పున 61గ్రామ పంచాయతీల్లో 778 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో వీరు ప్రత్యేక కార్యాచరణలో భాగస్వాములు కానున్నారు. వారోత్సవాలను మండల ప్రత్యేకాధికారులు కూడా పర్యవేక్షిస్తారు.

వారోత్సవాల్లో ఇలా..

- పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి.
- ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రై డే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీ



ట్యాంకులు, పశువులు తొట్లను శుభ్రంచేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

- వైకుంఠధామాలకు విద్యుత్తు, నీటి వసతి కల్పించడం, తడి, పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ. శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి, పాడుబడిన బావులను పూడ్చివేయడం, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు తొలగించడం వంటి పనులు చేయాలి.
- ప్రభుత్వ ప్రజోపయోగ సంస్థల్లో శుభ్రత పనులు, ఇంకుడు గుంతలను నిర్మించేలా చూడాల్సి ఉంది. మిగిలిపోయిన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం.

పనులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో వారం రోజులపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించాం. ఇళ్లు, ట్యాంకులను శుభ్రం చేయడంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక కార్యాచరణ అమలుపై గ్రామాల వారీగా మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు.

– రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి, మేడ్చల్ జిల్లా

ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి

జిల్లా సమన్వయ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మాతా శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు ఆదేశాల మేరకు బుధవారం మేడ్చల్‌లో ఆరోగ్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కోట్యానాయక్‌తో కలిసి ఆయన జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది బర్త్ ప్లానింగ్, ఐఎఫ్ఏ టాబ్లెట్స్, కుటుంబ నియంత్రణ, ఆరోగ్య మహిళా, 24 గంటల ల్యాబ్, ఎమర్జెన్సీ ఆపరేషన్లు, పోస్ట్ మోర్టర్మ్ సేవలను నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సి–సెక్షన్‌లను తగ్గించాలన్న మంత్రి హరీష్‌రావు దార్శనికతపై ప్రత్యేక శ్రద్ధ, చొరవ, చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన ఆదేశించారు. గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్యులకు, అవాంఛిత సిజేరియన్లను తగ్గించాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా వైద్యాధికారులు, వైద్యులు పనిచేయాలన్నారు.

సేవలను విస్తృతం చేయాలి

- జిల్లాలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ల సేవలు, టెలీ కాన్సులేషన్, అవుట్ పేషెంట్ మాడ్యూల్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల అందజేత వంటి విషయాలను డీఎంహెచ్ఓ అడిగి తెలుసుకు



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

న్నారు. కొత్త వైరస్‌లు, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని వారి సేవలను డాక్టర్ శ్రీనివాస్ కొనియాడారు. సీఆర్‌పీలో శిక్షణ పొందేందుకు వైద్య సిబ్బందిని గుర్తించడంతోపాటు కార్యాచరణ ప్రణాళిక, శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మాస్టర్ ట్రైనర్‌కు సంబంధించి ఒక్కో బ్యాచ్‌కి 20 చొప్పున 3 బ్యాచ్‌లలో ప్రతీ రోజు 60 మంది వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.5లక్షల విరాళం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి శ్రీనివాసనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం నిజాంపేట్ గ్రామ పెద్ద కొలన్ లీడర్ నర్సింహారెడ్డి రూ.2 లక్షలు, సీనియర్ నాయకులు కొలన్ కృష్ణారెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి రూ.50వేలు విరాళాన్ని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, ఉంగరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు విరాళం అందజేస్తున్న లీడర్ నర్సింహారెడ్డి

20 నుంచి 'డ్రాగన్ ప్లై కిడ్స్ ఫెస్ట్'

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఈ నెల 20 నుంచి డ్రాగన్ ప్లై థీమ్ తో ఉచిత ఎంట్రీతో కిడ్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధుల తెలిపారు. డ్రాగన్ ప్లై నేపథ్యంతో ఆహ్లాదకరమైన వినోద విజ్ఞాన కార్యక్రమాలు, తోలు బొమ్మలాటలు, మ్యాజిక్ షోలు, గేమ్‌లు, వర్క్‌షాప్‌లు, మీట్ అండ్ గ్రీట్ సెషన్లు, లైవ్ షోలు ఉంటాయన్నారు. వచ్చే నెల 4 వరకూ కొనసాగే ఈ ఫెస్ట్‌లో 12 ఏళ్ల లోపు చిన్నారులు పాల్గొనవచ్చన్నారు.

డివిజన్లలో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నాం

కుత్బుల్లాపూర్: సమస్యలేని నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్‌ను తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని డీపీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, పార్కులను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అన్ని డివిజన్లలో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీఈఈ పాపమ్మ, డీజీఎం రాజేష్, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వెంకటస్వామి, యూసుఫ్, మన్నన్, అనిల్, ప్రభాకర్, పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- డీపీకాలనీ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ 26వ



డీపీకాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

వార్షిక మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శాస్త్రి ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అధికారంలోకి రాగానే బ్లాక్ లాగ్ పోస్ట్‌లను భర్తీ చేస్తాం



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్లాక్ లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఆయన జీడిమెట్ల పాత గ్రామం, పేట్ బషీరాబాద్, ఎస్సీ బస్తీ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. తొమ్మిదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్సారం చేస్తూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు బేకు శ్రీనివాస్, సూదుల సంపత్‌గౌడ్, పుల్లెం రాజు, జేమ్స్, సిద్ధ నోళ్ల సంజీవరెడ్డి, నార్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

చింతల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తూ ముందుకు సాగుతున్నామని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదాబేగం అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ రోడా మేస్త్రీనగర్–ఏలో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రషీదా మాట్లాడుతూ... బస్తీల్లోని రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ రఫీ, మైనార్టీ అధ్యక్షుడు షానవాజ్, యూత్ ప్రధాన కార్యదర్శి నిజాం, మహిళా ప్రధాన కార్యదర్శి సావిత్రి, మైనారిటీ ప్రధాన కార్యదర్శి సాజిత్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు సాయికిరణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడామేస్త్రీనగర్–ఏలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రషీదాబేగం

మూత్రశాలల నిర్వహణ గాలికి..

రంగారెడ్డినగర్: మూత్రశాలల నిర్వహణ చేపడుతున్న కాంట్రాక్టర్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడంది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ టాయిలెట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయ రోడ్డు నుంచి గుడెన్‌మెట్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు నిరుపయోగంగా మారుతున్నాయి. వాటి నిర్వహణ చేపడుతున్న కాంట్రాక్టర్ సరైన నీటి వసతి కల్పించకపోవడంతో పాటు టాయిలెట్‌ను శుభ్రపరుస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. టాయిలెట్ వద్ద తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో కొందరు వ్యక్తులు సమీపంలోని బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రతినెలా సర్కిల్ అధికారులు కాంట్రాక్టర్‌కు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నా పర్యవేక్షించకపోవడంతోనే టాయిలెట్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని పలువురు ఆరోపిస్తున్నారు.



అపరిశుభ్రంగా టాయిలెట్

యూరాలజీ వైద్యుల అరుదైన చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: వృషణాలు మెలితిరిగి, తీవ్రమైన నొప్పితో బాధ పడుతున్న 18 ఏళ్ల యువకుడికి నగరంలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు చికిత్స చేసి ఊరట కల్పించారు. అంతేకాకుండా అతను ఓ వృషణం కోల్పోకుండా కాపాడారు. సికింద్రాబాద్ ఏఐఎన్‌యూకు చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టులు డా.రాఘవేంద్ర కులకర్ణి, డా.సూరజ్ పిన్ని తెలిపిన వివరాల ప్రకారం..నగర యువకుడికి తొలుత ఎడమ వృషణం, గజ్జల్లోను నొప్పి రావడంతో ఏఐఎన్‌యూకు తీసుకొచ్చారు. పరీక్షలు చేస్తే కొద్దిపాటి సమస్య తప్ప అన్నీ సాధారణంగానే ఉన్నాయి. కానీ, ఎడమవైపు ఎపిడైడిమిస్ మాత్రం బాగా లావుగా కనిపించింది. ఇంటర్మిటెంట్ టెస్టిక్యులర్ టోర్షన్ (ఐటీటీ) ఉంటుందన్న అనుమానాన్ని చెప్పి, శస్త్రచికిత్సే పరిష్కారమని వైద్యులు చెప్పారు. అయితే అప్పటికి వెళ్లిపోయిన వారు.. నాలుగు రోజుల తర్వాత నొప్పి బాగా ఎక్కువ కావడంతో యువకుడిని మళ్లీ ఏఐఎన్‌యూకు తీసుకొచ్చారు. అప్పుడు ఆ యువకుడి ఎడమవైపు అండకోశంలో నీరు బాగా చేరినట్లు వైద్యులు గుర్తించారు మరిన్ని పరీక్షల తర్వాత వృషణాలకు రక్తాన్ని సరఫరా చేసే స్పెర్మాటిక్ కార్డ్ మెలితిరిగిందని, దానివల్ల వృషణాలు కూడా మెలికపడ్డాయని తేలింది. దీంతో వెంటనే ఆ యువకుడికి శస్త్రచికిత్స చేశారు.

ప్రశాంతంగా పాలిసెట్

రాయదుర్గం: పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్–2023 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గచ్చిబౌలి పరిసరాల్లో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, విద్యార్థులంతా నిర్ణీత సమయానికే హాజరై పరీక్ష రాశారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ, గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్, మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మణికొండ జెడ్పీహెచ్ఎస్, నార్సింగి జెడ్పీహెచ్ఎస్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను కోఆర్డినేటర్ షేక్ ఎక్బాల్‌హుస్సేన్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, రాయదుర్గం జీఐఎల్‌టీ 150 మందికి 132 మంది(88శాతం). జెడ్పీహెచ్ఎస్ గచ్చిబౌలి 240కు 205 మంది(85.4శాతం), మధురా నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మందికి 219 మంది(91.25శాతం), జెడ్పీహెచ్ఎస్ మణికొండలో 240కు 206 మంది(85.83), జెడ్పీహెచ్ఎస్ నార్సింగిలో 300 మందికి 259 మంది (86.33శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఉదయం 10గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. డివిజన్ పరిధిలో రూ.84లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఆదిత్యనగర్‌లో రూ.49లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, నందమూరినగర్ రాంరెడ్డి చికెన్ సెంటర్ వద్ద రూ.35లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం పనులను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులతో కలిసి ప్రారంభిస్తారని కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో పేర్కొంది.

మధుమేహ వ్యాధికి సరికొత్త చికిత్స విధానం

రాయదుర్గం: మధుమేహ వ్యాధి కోసం సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఆస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్‌లోని స్టార్టప్ సంస్థ 'రీజెన్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ఈ సరికొత్త చికిత్స విధానాన్ని రూపొందించారు. రోగి చిన్నపేగు ద్వారా డైటరీ గ్లూకోజ్‌ను గ్రహించడాన్ని నిరోధించడం ద్వారా గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని, తద్వారా డయాబెటీస్ నిరోధించబడుతుందని రీజెన్ ఇన్నోవేషన్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం వంగల, రీజెన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ సక్సేనాలు తెలిపారు. టైప్–2 వ్యాధిగ్రస్తుల్లో రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి ఈ కొత్త విధానం తోడ్పడుతుందన్నారు.

25 వేలమంది నిరుద్యోగులకు శిక్షణ

యాకుత్‌పురా: 2023–24వ విద్యా సంవత్సరంలో 25 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ... గత ఏడాది సంస్థ కేంద్రాలతో పాటు ఫ్రాంచైజీలలో మొత్తం 16,490 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. నగరం, జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లో సైతం 57 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రసుత్తం ఉన్న 45 కోర్సులతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. నామమాత్రపు రుసుముతో ఆసక్తిగల అభ్యర్థులు శిక్షణ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.